విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నియంత, పెత్తందారులపై పోరాడుతున్నా.. : లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి : ఒక నియంత, పెత్తందారుపై నేను పోరాడుతున్నాను... వైసీపీ గోబెల్స్‌పై పోరాడుతున్నాను... అడుగడుగునా నాపై నిరాధార ఆరోపణలు చేయడం.. నిరూపించమంటే తోకముడవడం వైసీపీ వారికి బాగా అలవాటైంది. అందుకే న్యాయంకోసం న్యాయస్థానాల్ని ఆశ్రయించినట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. కోర్టుల కేసుల నిమిత్తం శుక్రవారం మంగళగిరి కోర్టుకు లోకేష్ వచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్ట్, వీసా ఉంటే చాలు.. కానీ జగన్ విదేశాలకు వెళ్లాలంటే సీబీఐ, ఈడీ, ఐటీ విభాగాలతో పాటు, కోర్టుల అనుమతి కావాలని ఎద్దేవాచేశారు. జగన్ అవినీతిని, క్విడ్ ప్రోకో పద్ధతిలో చేసిన దోపిడీని మేం ఆధారాలతో సహా బయటపెట్టాం. ప్రజలసొమ్ము కొట్టేసి, దాన్ని ఎటునుంచి ఎటు మళ్లించి, తిరిగి తన ఖజానాకు చేరేలా చేశాడో కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పామని, న్యాయస్థానాల ముందు రుజువు చేశామని, దాంతో ఆయన 16 నెలలు జైల్లో ఉండి వచ్చాడన్నారు. రూ.6 లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డామని, ఫైబర్ గ్రిడ్‌లో కుంభకోణానికి పాల్పడ్డామని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కుంభకోణమని, ఆస్తి తగాదా వల్ల మా పిన్ని చనిపోయారని ఆరోపణలు చేశారన్నారు. వైసీపీ వారైనా, ఇతరులైనా, ఎలాంటి ప్రసారమాధ్యమాలైనా ఎలాంటి ఆరోపణలు చేసినా వాటిని నిరూపించాలని సవాల్ చేస్తున్నా.. యువగళం పాదయాత్రలో వైసీపీ ఎమ్మెల్యేల అవినీతిని నేను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్నానని, అది తమ పార్టీ ద్వారా నేను నేర్చుకున్న చిత్తశుద్ధి.. క్రమశిక్షణ అన్నారు. జగన్ లక్ష కోట్లకు పైగా ప్రజాధనాన్ని లూటీ చేశాడన్నారు. ప్రతి ఏటా మా ఆస్తులు ప్రకటిస్తున్నానన్నారు. పోసాని కృష్ణమురళి సమాధానం చెప్పేవరకు వదిలిపెట్టనని, 14 ఎకరాలు నాకుంటే, ప్రభుత్వంలో ఉన్న వీళ్లు దానికి సంబంధించిన ఆధారాలను ఎందుకు బయటపెట్టడం లేదు? అందుకే పోసాని కృష్ణమురళిపై పరువునష్టం దావా వేశానని, గతంలో సాక్షిమీడియాపై కూడా పరువునష్టం దావా వేశానని గుర్తుచేశారు.
ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు స్పందించినా వారిపై దాడులు చేస్తున్నారు. మార్గదర్శి సంస్థ స్థాపించి 62 ఏళ్లు. ఏనాడూ ఏ ఒక్క డిపాజిట్‌దారుడు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఈనాడు సంస్థ తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తోందన్న అక్కసుతోనే మార్గదర్శిపై దాడులు చేయిస్తున్నారు. ఆ ఒక్క సంస్థే కాదు... అనేక మీడియా సంస్థలపై, విలేకరులపై కూడా దాడులు చేసి వేధిస్తున్నారు కదా! సొంత తల్లి, చెల్లిని మెడపట్టి గెంటేశాడు. బాబాయ్‌ని చంపించి, ఆ నేరాన్ని ఇతరులపైకి నెట్టి ఎన్నికల్లో గెలిచాడు. పరిశ్రమల్ని తన్ని తరిమేస్తున్నాడు. యువత ఉద్యోగ, ఉపాధిలేక మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు.
మంగళగిరి ప్రజల కోసం సొంత డబ్బుతో 27 పథకాలు పెట్టాను. కరకట్ట కమలహాసన్‌ని సూటిగా ఒక్కటే ప్రశ్నిస్తున్నా. ఎన్నికలకు ముందు కొండ, వాగు పోరంబోకు భూములు, ఇతర భూముల్ని రెగ్యులరైజ్ చేయించి, ప్రజలకు పట్టాలిప్పిస్తానని చెప్పాడు. ఆ హామీ ఏమైంది? ఇక్కడి నుంచి 100 మీటర్ల దూరంలో ఉన్న మెయిన్ రోడ్డుపై బహిరంగసభ పెట్టి అమరావతి ఎక్కడికీ పోదన్నాడు. అదే వ్యక్తి అసెంబ్లీలో మూడురాజధానుల బిల్లు పెట్టినప్పుడు అనుకూలంగా ఎందుకు ఓటేశాడు? నేను ఓడిపోయినా ఇక్కడే ఆయనకంటే ఎక్కువగా ప్రజల్లో ఉన్నానన్నారు. 2024లో మంగళగిరిలోనే పోటీచేస్తా.. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనంత మెజారిటీతో గెలుస్తా అని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా ప్రధాన లక్ష్యం. నాలుగేళ్ల మూడు నెలల్లో ఒక్క పరిశ్రమ తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

ఉపసంచాలకులకు సత్కారం

విశాలాంధ్ర-మంగళగిరి : జిల్లా ఖజానా కార్యాలయ ఉప సంచాలకులు బి.రాజ గోపాలరావు వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళగిరి ఖజానా కార్యాలయానికి శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఏపీఎన్జీవో సంఘం నేతలు కలిశారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉద్యోగులకు 16 శాతం హెచ్ఆర్ఏ ఫైల్ త్వరగా పంపటం, ఇతర అంశాలపై ఆయనతో మాట్లాడారు. జిల్లా ఖజానా అధికారి ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై సిబ్బందికి తగు సలహాలు సూచనలు చేశారు. అనంతరం రాజగోపాల్‌ను ఏపీఎన్జీవో సభ్యులు ఘనంగా సత్కరించారు. మంగళగిరి ఖజానా అధికారి ఏ.శ్యాం బాబు, పి.శేష సాయి, ఏపీఎన్జీవో యూనిట్ ప్రెసిడెంట్ కె.శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత డెమో క్లాసులు

విశాలాంధ్ర-గుంటూరు : ఉపాధ్యాయ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న బీఈడ్, డీఎడ్ విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణలో విశేష అనుభవం ఉండి వేలాదిమందిని ఉద్యోగార్థులను చేసిన విజయసాధన స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21, 22వ తేదీలలో ఉదయం 9 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఎస్సీలో ఉచిత డెమో క్లాసులు స్థానిక బ్రాడీపేటలోని విజయసాధన స్టడీ సర్కిల్(మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల క్యాంపస్) సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కె.గంగా కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 22 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలో డీఎస్సీ కోచింగ్‌లో అత్యంత అనుభవజ్ఞులైన అధ్యాపకులతో డెమో క్లాసులతో పాటు రెగ్యులర్ క్లాసులు నిర్వహిస్తున్నామని, వివరాలకు 0863-2240433, 9293177737లలో సంప్రదించాలని కోరారు.

నేడు సామూహిక లక్ష్మీ పూజలు

విశాలాంధ్ర-తాడేపల్లి : సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో శనివారం సాయంత్రం త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సామూహిక లక్ష్మీ పూజలు నిర్వహిస్తున్నట్లు అహోబిల రామానుజ జీయర్ స్వామి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ఛైర్మన్ గౌతమ్ రెడ్డి, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్‌సీసీ ట్రూపు

విశాలాంధ్ర-తెనాలి : కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నూతనంగా ఎన్‌సీసీ ట్రూపు ప్రారంభించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఎన్‌సీఆర్ఎం హైస్కూల్ ఎన్‌సీసీ ఆఫీసర్ కె.స్వామి ఎన్‌సిసి విద్యార్థులను పరిచయం చేశారు. 31వ వార్డు కౌన్సిలర్ మానసారెడ్డి మాట్లాడుతూ నవభారత్ నిర్మాణంలో ఎన్‌సీసీ కీలకపాత్ర వహిస్తుందన్నారు. అలాంటి ఎన్‌సీసీ యూనిట్ తన వార్డులోని కేఎస్ఎం హైస్కూల్‌కు రావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు కృషి చేసిన ఎన్‌సిసి కేర్‌టేకర్ తాడిబోయిన వెంకట భాస్కరరావుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ మనోజ్, ట్రైనింగ్ జెసిఒ అవతార్‌సింగ్, పిఐ స్టాఫ్ శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలపాటి ఆధ్వర్యంలో బైకు ర్యాలీ

విశాలాంధ్ర-తెనాలి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 16 రోజులుగా కొనసాగి కృష్ణా బ్యారేజి మీదుగా కృష్ణా జిల్లాల్లోకి ప్రవేశిస్తుందని ఆ ర్యాలీలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనమైన వీడ్కోలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా తెనాలి నుంచి భారీ బైక్‌ర్యాలీ మధ్యాహ్నం 1 గంటకు చినరావూరు పార్కు నుంచి బయలుదేరుతుందని నియోజకవర్గ పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, వంగా సాంబిరెడ్డి, కంచర్ల వేణుగోపాల్, భీమవరపు చినకోటిరెడ్డి, ఈదర వెంకట పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలపై వరద నీరు

విశాలాంధ్ర-తాడికొండ : గురువారం రాత్రి ఎడతెరపిలేని వర్షం కురిసింది. పంట పొలాలపై వరద నీరు చేరింది. పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి, పత్తి, మినుము, జూటు పంటలు నీట మునిగాయి. 70.2 వర్షపాతం నమోదైంది. కొండవీటి వాగు నిండు కుండల మారింది. గత 20 రోజులుగా బెట్టకు వచ్చిన పంటలకు ఈ వర్షంతో కొంత ఉపశమనం లభించింది.

హిందూ ఫార్మశీలో 'రామనాధ్ చోప్రా' జయంతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అమరావతిరోడ్డులో ఉన్న హిందూ ఫార్మశీ కళాశాలలో 'ఫాదర్ ఆఫ్ ఫార్మకాలజీ' డాక్టర్ రామనాధ్ చోప్రా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం హిందూ ఫార్మశీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మకాలజీ, ఫార్మశీ ప్రాక్టీస్ వారు సంయుక్తంగా బెంగుళూరులోని స్వచ్ఛంధ సంస్థ డీకెఎంఎస్, బీఎంఎస్‌ఎస్టీ ఫౌండేషన్ ఇండియా వారి సహకారంతో శుక్రవారం కాలేజీ ప్రాంగణంలో 'బ్లడ్ క్యాన్సర్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వేడుకలకు అసోసియేట్ డోనార్ రిక్రూటర్ ఆర్.కృతిక బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ద్వారా తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మకాలజీ హెచ్ఓడీ డాక్టర్ బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మశీ ప్రాక్టీస్ డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో జిల్లా ముందుకు: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జిల్లాను ప్రగతి పథంలో ముందుకు తీసుకువెళ్ళేలా ప్రణాళికలను రూపొందించుకోవాలని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై చీఫ్ ప్లానింగ్, వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్, విద్యా శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మొదలై 10నెలలు అయిందని ఇంకా ట్రైల్ రన్ జరుగుతుందన్నారు. డాక్టర్లతో తరుచుగా మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై గ్రామాలలో ప్రజల్లో వున్న అభిప్రాయాలను సేకరించాలన్నారు. గర్భిణీల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ఎఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు గర్భిణీ స్త్రీలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు చేయించేలా చూడాలన్నారు. కష్టతరమైన సమయంలో మాత్రమే జిల్లా ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఓ శేషశ్రీ, అడిషనల్ డిఎంహెచ్ఓ ఎ.అన్నపూర్ణ, డిఎంహెచ్ఓ డా.శ్రావణ్ బాబు, డిసిహెచ్ఎస్ డా.హనుమంతరావు, ఐసిడిఎస్ పిడి మనోరంజని, డిఈఓ శైలజ, అధికారులు పాల్గొన్నారు.

5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి గత రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని, లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వడ్డె బాలయ్య జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బందికి సంబంధించిన పీఎఫ్, ఈఎస్ఐ కూడా పెండిం గ్‌లో ఉన్నాయన్నారు. జీఓ నెంబర్ 549 ప్రకారం నెలకు రూ.16వేలు చెల్లించాల్సి ఉండగా... కాంట్రాక్టర్ కేవలం రూ.11800 మాత్రమే ఇస్తున్నట్లు ఆరోపించారు. జీతం నుంచి రూ.4,200 కట్ చేస్తున్నారని, అయితే ఆ అమౌంట్‌కు ఎటువంటి రశీదులు ఇవ్వటం లేదన్నారు. పీఎఫ్ విషయంలో సిబ్బందికి అన్యాయం జరుగుతుందని, ఈఎస్ఐ కార్డు లేకుండానే తమ జీతం నుంచి అమౌంట్ కట్ చేస్తున్నట్లు చెప్పారు. 16, 549 జీఓ ప్రకారం రూ.16వేలు ప్రభుత్వం ఇస్తుంటే సిబ్బందికి మాత్రం రూ.11,200 మాత్రమే ఇస్తు న్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా రూ.4800లకు సంబంధించి లెక్కా పత్రం ఉండటం లేదని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్ళినట్లు పేర్కొన్నారు. పెండింగ్ జీతాలు తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కాపు రిజర్వేషన్ సాధికార ఛైర్మన్‌గా 'రేమినిశెట్టి'

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు జిల్లా కాంగ్రెస్ కాపు రిజర్వేషన్ సాధికారిక ఛైర్మన్‌గా యర్రబాలెంకు చెందిన రేమినిశెట్టి హనుమంత రావును నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ కాపు సాధి కారిక సంఘం అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వర రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ సలీం నియామక పత్రాన్ని రేమినిశెట్టికి అందజేశారు. అనంతరం సలీం మాట్లాడుతూ కాపుల రిజర్వేషన్‌కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. 2024 ఎన్నికలలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడానికి ప్రతిఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పాకుల కృష్ణారావు చౌదరి, పట్టణ మహిళా అధ్యక్షురాలు కూర్మాల రాధిక, రూరల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యేళ్ళ రత్న గోపాల్, నాయకులు గుడిపాటి అర్జునరావు, గోలి సాంబశివరావు, షేక్ సుల్తానా, రేమినిశెట్టి శేషయ్య, గండికోట వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

యువగళం వీడ్కోలు యాత్ర ఘనంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు జిల్లాలో జరిగే టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం వీడ్కోలు యాత్ర ఘనంగా ఉండాలని, గుంటూరు నగర నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై పాదయాత్రను గుంటూరు జిల్లా దాటించాలని జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ కోరారు. యువగళం పాదయాత్రకు ఘనంగా వీడ్కోలు తెలుపుటకు జిల్లా పార్టీ కార్యాలయంలో నగరంలోని డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్లు, క్లస్టర్, యూనిట్ ఇంఛార్జులతో సమావేశం జరిగింది. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గము ఉండవల్లి నుండి ప్రకాశం భ్యారేజి మీదుగా కృష్ణ జిల్లాకు పాదయాత్ర సాగనుందని, ప్రకాశం భ్యారేజి దగ్గరలోని సీతానగరం వద్ద యువగళం పాదయాత్ర 2500 కిమీ పూర్తవుతున్న సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్రకుమార్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్‌లు నసీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, నగర పార్టీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మానుకొండ శివప్రసాద్, సుఖవాసి శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు : పట్టణ పరిధిలోని సమస్య ఉన్న ప్రదేశాల్లో ఆర్ఓబీ, ఆర్‌యూబీల ఏర్పాటు జరగటంలో తన వంతు కృషి చేస్తానని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గుంటూరు పట్టణ పరిధిలో ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో.. ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకి సంబంధించి.. గుంటూరు తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా, మహిళా నాయకులు నూరి ఫాతిమా, డిప్యూటీ మేయర్ బాల వజ్రబాబు, కార్పొరేటర్‌లు, నాయకులు... గుంటూరులో ఎంపీని కలిశారు. గుంటూరులోని నెహ్రూనగర్, సంజీవయ్యనగర్, మూడు వంతెనల రహదారి దగ్గర, ఇన్నర్ రింగ్ రోడ్ వైపు గడ్డిపాడు వద్ద.. ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు జరగక.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించిన మ్యాప్‌ను ఎంపీకి నాయకులు చూపి క్షుణ్ణంగా వివరించారు. ఈ సమస్యలపై వెనువెంటనే గుంటూరు డీఆర్ఎం రామకృష్ణతో మాట్లాడి.. నిర్మాణాల గురించి వివరించి.. వీలైనంత త్వరగా నిర్మాణం జరిగేలా సహకరించాలని కోరారు. అలాగే పట్టణంలో ఎంతో ప్రాధాన్యత ఉన్న బ్రహ్మానంద రెడ్డి స్టేడియం అభివృద్ధిపై చర్చించారు. ఈ స్టేడియంను ఖేలో ఇండియా పథకం కింద అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని, వీలైతే తన ఎంపీ నిధులు ఇస్తానని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ చొరవతో సమిష్టి కృషి చేసి.. పట్టణ ప్రజల రైల్వే సమస్యలు, మరి కొన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని ముస్తఫా తెలిపారు.

కంచర్ల కాశయ్యకు కేవీవీ పరామర్శ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఎయిమ్స్ హాస్పిటల్లో ఆపరేషన్ చేయించుకొని డిశ్చార్జ్ అయిన సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్యను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కాశయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. కాశయ్యను పరామర్శించిన వారిలో పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. వారిలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీపీఎం నాయకులు పల్లె కృష్ణ, భక్తుల శాంసన్, వైసీపీ నాయకులు ఈదులమూడి డేవిడ్ రాజ్, చిన్నపోతుల దుర్గారావు, గౌడ సంఘం నాయకులు వాకా మాధవరావు గౌడ్, తాతా కోటయ్య గౌడ్, వై.కోటేశ్వరరావు గౌడ్, కంచర్ల శివప్రసాద్ రావు గౌడ్, చింతా సాంబశివరావు గౌడ్ ఉన్నారు.

వేదయ్య పేరిట 'నాటకోత్సవాలు-సాహిత్య' పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సామాజిక, సాహిత్య, కళా రంగాలకు విశిష్ట సేవలందించిన వేదయ్య జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం రెండు రోజులు పాటు నాటకోత్సవాలు-సాహిత్య సభలు నిర్వహించి కళాకారులను, కవులను సత్కరిస్తామని మాజీమంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక అమరావతి రోడ్డు 'వేదిక' గార్డెన్స్‌లో వేదయ్య సంస్మరణ సభ అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు వేదయ్యకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వేదయ్య రాసిన 'ప్రజాకవి గురజాడ' పుస్తకాన్ని డొక్కా ఆవిష్కరించారు. డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ వేదయ్య చేసిన కృషి, సేవలు నిరుపమానమని కొనియాడారు. జాషువా సాహిత్యంపై సాధికారిత కలిగిన సాహితీవేత్త అని, అందరి గుండెల్లో ఆయన నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో కన్నా మాష్టార్, బాపిరెడ్డి, కృష్ణారెడ్డి, కాపూరి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే డ్రగ్స్ మాఫియా

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థులు, యువకులను గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారుస్తున్న డ్రగ్స్ మాఫియా అంతా వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరుగుతుందని జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఒక ప్రకటనలో విమర్శించారు. గురువారం బాపట్ల జిల్లా మార్టూరు మండలం బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద దొరికిన ప్రమాదకమైన లిమెదా ఫిటమైన్ డ్రగ్‌లి కేసులో గుంటూరుకు చెందిన ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యుడు ఉండటంపై ఆయన శుక్రవారం స్పందించారు. ఇప్పటికే గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలై యువకులు తమ జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని అలాంటిది ఇప్పుడు బ్రౌన్ షుగర్ లాంటి మాదకద్రవ్యాల వ్యాపారాన్ని కూడా వైసీపీ నేతలు ప్రోత్సహిస్తే రాష్ట్రం ఏమైపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ గుంటూరుకు చెందిన వైసీపీ ప్రజాప్రతినిధి నిషేధిత గుట్కా వ్యాపారాన్ని కొనసాగించిన ఆరోపణలు వచ్చాయన్నారు. కొన్ని నెలల క్రితం ఇదే ప్రజాప్రతినిధి కుమారుడు, ప్రముఖ హోటల్ యజమాని కుమారుడు నైజీరియన్ దేశస్థుడుతో కలిసి మాదకద్రవ్యాలను తయారుచేస్తూ పోలీసులకు చిక్కిన సంఘటన కూడా ప్రజలకు తెలిసిందేనన్నారు. దేవాదాయ శాఖ భూములు, వక్ఫ్ భూములను సైతం అక్రమించుకునేందుకు ఏమాత్రం వెనుకాడని స్థితిలో ఆ వైసీపీ నేత కుటుంబ సభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అదే ప్రజాప్రతినిధి తమ్ముడి కుమారుడు బ్రౌన్ షుగర్ వంటి ప్రమాదకర డ్రగ్‌ని సరఫరా చేయటం అత్యంత దుర్మార్గమని ధ్వజమెత్తారు. డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డ వారు ఎంతటివారైనా ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని కోరారు.

పీఆర్సీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-తుళ్లూరు : విద్యుత్ ఉద్యోగులకు కార్మికులకు నష్టం చేయాలనే టార్గెట్‌గానే పీఆర్సీ ఒప్పందం ఉందని వెంటనే తిరోగమన పీఆర్సీని రద్దు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ జిల్లా నేత బి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు నష్టం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం, పవర్ జేఏసీ కుదుర్చుకున్నటువంటి ఒప్పందం ఇంజనీర్లు, విద్యుత్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులు, పీస్ రేట్ కార్మికులకు నష్టదా యకంగా ఉందని, జేఎల్ఎం గ్రేడ్-2లకు ఈ వేతన ఒప్పందం అసలు వర్తించదని కాబట్టి తక్షణమే ఈ వేతన ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని అడుగుతున్నారే తప్పా గొంతెమ్మ కోరికలు ఏం కోరటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ నాయకులు జి.పవన్, టి.వర్మ, వెంకటస్వామి, సురేష్, రాజేష్, దేవుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: గ్రామాల్లో ప్రతి ఇంటి పరిసరాలను ఎప్పకప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రతే అందరికి ఆరోగ్యమని నుదురుపాడు పిహెచ్‌సి ఎంపీహెచ్ఈవో తెనాలి లూర్దురాజు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రమైన ఫిరంగిపురంలో ఒకటి మూడు సచివాలయాల పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈవో మాట్లాడుతూ దోమ తెరలు ద్వారా దోమల బారి నుంచి రక్షించుకోవచ్చున్నారు. ప్రతి ఇంటిలో నీటి తొట్టెలు, పాడు బడిన కుండలు, వాడిన కొబ్బరిబోండాలు, ఫ్రిజ్‌లను పరిశీలించి వాటిలో పెరుగుతున్న దోమల గుడ్లు లార్వాల గురించి ప్రజలకు వచ్చే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలని, దోమలు పుట్టకుండా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు. పరిసరాలు శుభ్రంగా లేకుంటే దీని వలన కలిగే వ్యాధుల గురించి అవగాహన పర్చారు. హెల్త్ సూపర్‌వైజర్ అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, టీచర్‌లు పాల్గొన్నారు.

మూడో రోజు రిలే నిరాహారదీక్షలు

విశాలాంధ్ర-తెనాలి : వైఎస్ఆర్ మజ్దూర్ అసోసియేషన్ & వై.ఎస్.ఆర్. ఎంప్లాయిస్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు బుధవారం తెనాలి డిపోలో జరిగాయి. వైఎస్సార్ అసోసియేషన్ సభ్యులను డిపో మేనేజర్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అందుకు నిరసనగా ఈ రిలే దీక్షలు జరుగుతున్నాయని అన్నారు. ఒక వర్గం వారికి మద్దతు ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. డ్యూటీల మార్పులో, లీవులు ఇవ్వడంలో కూడా పక్షపాత వైఖరి వహిస్తున్నారని అన్నారు. తెనాలి డిపోలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు తెలిపారు. శుక్రవారం దీక్షలో ఎ.శ్రీనివాసరావు (డ్రైవర్), కె.అశోక్ కుమార్ (కండక్టర్), ఎన్.వి.పి.బాబు, సుధాకర్, వేణుగోపాల్, బి.పాపారావు, చిట్టి బాబు, కె.ప్రభావతి, యం.ఆర్. బాబు, సురేష్ పర్యవేక్షణలో దీక్షలు కొనసాగించారు. అక్రమ ఒ.డి. (అవుటాఫ్ డిజిగ్నేషన్) రద్దు చేయాలి, ఉద్యోగులను రెండు వర్గాలుగా విభజించి, ఒక వర్గంకు మాత్రమే పనిచేసే విధానం మానుకోవాలి, ఇష్టం వచ్చినట్లుగా కేటా యించిన ఛార్టులను రద్దు చేసి సీనియారిటీ ప్రకారం డ్యూటి చార్టులు ఇవ్వాలి, లీవులు, డ్యూటీలు, డీలియేషన్‌లలో అవకతవకలు సరిచేయాలని డిమాండ్ చేశారు.

యువ స్టార్టప్ లిస్టులో కేఎల్‌యూ పూర్వ విద్యార్థి

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫోర్బ్స్ అనే పత్రిక వెబ్‌సైట్‌లో గుంటూరుకు చెందిన సాయి ప్రజ్వల్ కాటంరాజుకు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ స్థాయిలో అతిపెద్ద స్టార్టప్ ప్రారంభించిన 30 ఏళ్లలోపు యువకుల లిస్టులో సాయి ప్రజ్వల్, అతని స్నేహితుడు జోర్డాన్ జస్టస్‌లు తమ పేరులు చిరస్థాయిలో నిలిచిపోయే విధంగా రికార్డును సృష్టించారు. దీంతో ఫోర్బ్స్ అనే పత్రిక వీరిని ప్రపంచ యువ స్టార్టప్ అధినేతలలో ఒకరుగా చేర్చి వ్యాసం రాయడంతో ప్రపంచ దృష్టి వీరి వైపు మళ్లింది. ప్రపంచ స్థాయిలో స్టార్టప్‌ను ప్రారంభించిన తెలుగు అబ్బాయి గుంటూరులో పుట్టి పెరిగిన ప్రజ్వల్ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్‌లో పాఠశాల విద్యను పూర్తిచేశాడు. అక్కడ సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. ఇంత ఘనత సాధించిన సాయి ప్రజ్వల్ కేఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బీటెక్ చదివడం, రిజిస్ట్రార్ డాక్టర్ కాటంరాజు సుబ్బారావు తనయుడు కావడం మరి విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రజ్వల్ మాట్లాడుతూ యువ స్టార్టప్ లిస్టులో స్థానం దక్కటం ఆనందంగా ఉందన్నారు.

గర్భిణీ ప్రాణాలు నిలబెట్టిన జీజీహెచ్ సూపరింటెండెంట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న గర్భిణీ మహిళకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ వైద్యం చేసి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన లావణ్య ఏడు నెలల గర్భిణీ. ఆమె ఇంట్లో ఉండగా ఒక్కసారిగా బీపీ పెరగడంతో ఫీట్స్ వచ్చాయి. వెంటనే 108కు ఫోన్ చేశారు. ఆ వెను వెంటనే ఆ వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో కాన్పుల వార్డు నుంచి క్యాజువాల్టి వైపు వెళుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ గమనించారు. గర్భిణీ తండ్రి తన బాధను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్ళాడు. అప్పటికే స్ట్రెచర్ లేదని పది నిమిషాల నుంచి కాన్పుల వార్డు ఎదురు గర్భిణీ వేచి ఉండి ఇబ్బందులు పడ్డారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ రంగంలో దిగి వెంటనే ఆమెను కాన్పుల వార్డుకు తీసుకెళ్ళి చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం లావణ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, గైనిక్ విభాగం హెచ్ఒడి డాక్టర్ జయంతి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహణపై ప్రశంసలు

విశాలాంధ్ర-తెనాలి : ప్రభుత్వ ఆదేశాల మేరకు గడపగడపక మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా 23వ వార్డులో ప్రశంసా కార్యక్రమం జరిగింది. తెనాలి శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్, తెనాలి మున్సిపల్ మున్సిపల్ కమీషనర్ జశ్వంతరావు, 23వ వార్డు కౌన్సిలర్ తోక శిరీషలు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆదేశించారు.

यूनियन बैंक Union Bank of India

హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్
సిద్ధిఅంబర్ బజార్, పోస్ట్ బాక్స్ నెం. 1108-సి, హైదరాబాద్, తెలంగాణ.

డిమాండ్ నోటీసు సెక్షన్ 13(2) క్రింద

దిగువ వారికి: 1. ఋణగ్రహీత: శ్రీమతి యంపరాల పద్మజ, ఇ.నెం. 7-47/4, అంబేద్కర్ నగర్, హెచ్ఎంటి పోస్ట్ చింతల్, హైదరాబాద్-600054, తెలంగాణ. 2. కో-ఆబ్లిగెంట్: శ్రీమతి గద్దిపాటి మంజుల, ఇ.నెం. 48-226, పి.నెం. 111, సూర్యానగర్, హెచ్ఎంటి కాలనీ, చింతల్, హైదరాబాద్, తెలంగాణ-500037.
డియర్ సర్
హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్/ నా ద్వారా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద 02.05.2023 తేదీతో డిమాండ్ నోటీసు అధీకృత అధికారి ద్వారా చివరిగా తెలిసిన వారి చిరునామాకు మీ రుణ ఖాతా/లలోని బకాయిలను తిరిగి చెల్లించమని కోరుతూ జారీచేయగా అవి బట్వాడా కాలేదు. కావున ఈ దిన పత్రిక ద్వారా సదరు డిమాండ్ నోటీసులోని విషయములను ప్రచురించడమైనది.
సదరు రుణ సదుపాయములు/ క్రెడిట్ సదుపాయములను తేది: 01.05.2023న ఎన్‌పిఏగా వర్గీకరించడమైనది.
బ్యాంక్‌పేరున సెక్యూరిటీ ఇంటరెస్ట్‌గా సృష్టించి మరియు పొందిన సదుపాయముల రుణపత్రములను మీ ద్వారా అమలు పరచినారు. క్రెడిట్ సదుపాయముల మరియు సెక్యూర్డ్ ఆస్తుల వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.
తేది: 02.05.2023 నాటికి పొందిన క్రెడిట్ సదుపాయములపై రావలసిన బకాయి మొత్తములు రూ. 12,38,089.90/- (రూపాయలు పన్నెండు లక్షల ముప్పై ఎనిమిది వేల ఎనభై తొమ్మిది మరియు పైసలు తొంభై మాత్రమే) చెల్లించవలసియున్నది.
సెక్యూర్డ్ ఆస్తులు: ఆంధ్రప్రదేశ్-522501, గుంటూరు జిల్లా, తాడేపల్లి చిన్న ఆంజనేయస్వామి దేవాలయం ఎదురుగా, సీతానగర్, డోర్ నెం. 13-65/11 గల భవనములోని గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుతో గల నివాస ఆస్తి. సరిహద్దులు: తూర్పు: ఎగ్జిక్యూటెంట్ యొక్క మిగిలిన ఆస్తి, దక్షిణం: దారి, పడమర: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: ప్రసన్నరాజీ ఆస్తి.
కావున మీలో నెం. 1 అయిన ఋణగ్రహీతలు మరియు నెం. 2 అయిన హామీదారు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తం రూ. 12,38,089.90/- (రూపాయలు పన్నెండు లక్షల ముప్పై ఎనిమిది వేల ఎనభై తొమ్మిది మరియు పైసలు తొంభై మాత్రమే) + తదుపరి వడ్డీ + ఛార్జీలతో తిరిగి చెల్లించమని కోరడమైనది. విఫలమైనచో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన ఏదైనా లేదా అన్ని హక్కులను వినియోగించుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ పూర్తి హక్కులు కలిగియున్నారు. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద బ్యాంక్‌వారి ముందస్తు అనుమతి లేకుండా నోటీసు స్వీకరణ తేది నుండి పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను బదిలీ చేయుటకు మిమ్మల్ని నిషేధించినారు. మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల లభ్యతకు సంబంధించి సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా కోరడమైనది.
తేది: 18.08.2023, ప్రదేశము: హైదరాబాద్ — అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పాస్‌పోర్ట్ పోయినది

బాపట్ల జిల్లా, అమృతలూరు మండలం, మూల్పూరు గ్రామం, డోరు నెం.2-147రు కాపురస్తులు **వడ్డేశ్వరపు చిన్నోడు** గారి కుమారుడు **వడ్డేశ్వరపు రవి కిరణ్ (సెల్ : 9703457485)** అను నేను నా పేరిట గల **పాస్‌పోర్ట్ నెం. T4174814** ఒరిజినల్‌ను నా ఇంటి వద్ద నుండి మూల్పూరు సెంటర్‌కు ఫొటో స్టాట్ కోసం బైకుపై వెళ్లుచుం డగా మార్గమధ్యలో పోయినది. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, ఏటుకూరు రోడ్డు, డీఎస్ నగర్ ఎదురు, బృందావన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, జాస్మిన్ నార్త్, ఫ్లాట్ నెం.204రు కాపురస్తులు **ఏనుగంటి వెంకటరావు** గారి కుమార్తె **ఏనుగంటి వెంకట సరిత (సెల్ : 6305178199)** అను నేను నా పేరిట గల **పాస్‌పోర్ట్ నెం. V5420323** ఒరిజినల్‌ను **ది.14-08-2023**న నా ఇంటి వద్ద నుండి సమీపంలో గల ఫొటో స్టాట్ సెంటర్‌కు టూవీలర్‌పై వెళ్లుచుండగా పోగొట్టుకున్నాను. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, కాకుమానువారితోట 4వ లైను, డోరు నెం.7-11-197/బి కాపురస్తులు **అడుసుమల్లి వెంకటస్వామి** గారి భార్య **అడుసుమల్లి వరలక్ష్మి (సెల్ : 89859 65119)** అను నేను నా పేరిట గల **పాస్‌పోర్ట్ నెం. V1952760** ఒరిజినల్‌ను **ది.11-08-2023**న మార్కెట్ నుండి చౌత్రాసెంటర్‌కు ఆటోలో వెళ్లుచుండగా పోగొట్టుకున్నాను. సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్లు అయిన గుంటూరుజిల్లా, పెదకాకాని(మం), అగతవరప్పాడు గ్రామ కాపురస్తులు 1)తాళ్ళ వీరాంజనేయులు, 2)తాళ్ళ రాజేశ్వరి, 3)తాళ్ళ శ్రీకాంత్ గార్ల వలన సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు ఆస్తి తాళ్ళ పద్మ W/o. వీరాంజనేయులు గారి పేరిటకి ది.24-06-1996న విక్రయ దస్తావేజు నెం.1407/1996 యస్.ఆర్.ఓ తాడికొండగా, షేక్ రషీద్ గారి వలన క్రయం పొంది రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా తాళ్ళ పద్మగారికి సంక్రమించి ఆమె సర్వ హక్కులతో అనుభవించుచూ ది.01-05-2021న ఇంటిస్టేట్‌గా మరణించిన దరిమిలా ఆమె ముఖ్య వారసులైన నా క్లయింట్లకు సంక్రమించియున్నది. అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు అయిన విక్రయ ద.నెం.202/1970 యస్.ఆర్.ఓ. తాడికొండ గల దస్తావేజు మరికొన్ని డాక్యుమెంట్స్‌ను ది.14-08-2023న తాడికొండలో మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికేట్ కొరకు తీసుకొని వెళ్ళి అక్కడ జిరాక్స్ తీయించుకొని రిజిష్ట్రారు ఆఫీసుకు వెళ్ళి బయటకు వచ్చి చూసుకొనగా సదరు బండి కవరులో ఫుంచిన పైతెలిపిన ఒరిజినల్ విక్రయ ద.నెం.202/1970 పోయినది.ఆ చుట్టుపక్కల ఎంత వెతికినను మరియు విచారించినను దొరకలేదు. కావున సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు ఎవరికైన దొరికినయెడల నాకు గాని, నా క్లయింట్లకు గాని అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.అట్లుకాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపినయెడల మాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయటమైనది.
షెడ్యూలు:గుంటూరు డి॥, తాడికొండ సబ్.డి॥ & (మం), లాం గ్రామం డి.నెం.410లో య.1-18 1/2సెంట్ల భూమికి **హద్దులు. తూర్పు:** రాయపూడి ప్రావిన్స్ గారి భూమి,**దక్షిణం:**రావూరి ఎలిజబెత్ రాణి గారి భూమి,**పడమర:** దాసరి కృపమ్మగారిభూమి, **ఉత్తరం:** దాసరి కృపమ్మగారి భూమి.

K.N.M. KISHORE, Advocate
3/2 Brundavan Gardens, Guntur. Cell :98485 70106.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

గాజుల అలంకరణలో శ్రీలక్ష్మి అమ్మవారు

విశాలాంధ్ర-దుర్గి : శ్రావణ మాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని ఆలయ ఈఓ శ్రీగిరి రాజు నరసింహాబాబు నేతృత్వంలో అర్చకులు మండల పరిధిలోని నిదానంపాడులో వేంచేసియున్న అడిగోప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించారు. భక్తులు పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని మహిళా భక్తులు వీక్షించి దర్శించుకున్నారు. భక్తులకు స్నానాలు ఆచరించేందుకు దేవస్థానం వారు పుష్కలంగా నీటిని సరఫరా చేశారు.

వైఎస్సార్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని కంచరగుంట్ల గ్రామంలో శుక్రవారం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. తొలుత ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

25 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-రెంటచింతల : రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి ప్రత్యేక సమావేశాలు ఉండటం వలన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి స్పష్టం చేసారు. శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అయిన రెంటచింతలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పూజల రామయ్య, జడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, మోర్తల ఉమామహేశ్వర రెడ్డి, పమ్మి సీతారామి రెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి, ఎంపీటీసీ పాముల సంపూర్ణమ్మ, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, కొమ్మారెడ్డి మల్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, పేర్ల ముత్తయ్య, గొట్టం భాస్కర్ రెడ్డి, కట్టమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయం ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ రాజనాల నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.30.88లక్షలు

విశాలాంధ్ర-అమరావతి : అమరావతిలోని శ్రీబాల చాముండి సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రధాన హుండీలు లెక్కించగా భక్తుల నుంచి రూ.30,88,133లు కానుకలు వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ అధికారులు తెలిపారు. అలాగే అన్నదానం హుండీల ద్వారా రూ.1,64,953లు వచ్చాయని, 5 గ్రాముల 800 మిల్లి గ్రాముల బంగారపు వస్తువులు, 206 గ్రాముల వెండి వస్తువులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గోపి తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-శావల్యాపురం : అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన శావల్యాపురం మండలం పిచికలపాలెం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకరం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన గణేష్ మహీంద్రా బొలొరో వాహనంలో 40 టిక్కిల రేషన్ బియ్యం తీసుకుని పిచికలపాలెం మీదుగా వినుకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనంను నిలుపుదల చేసి తనిఖీ చేయగా, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. వాహనంతోపాటు, సరుకును కూడా స్వాధీనం చేసుకున్నామని, గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా మహిళల కోలాట ప్రదర్శన

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అడవి పేరంటాలమ్మ దేవాలయ ఆవరణలో శ్రావణ మాసం ప్రారంభ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు. కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగలి వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరె సారెలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. రాత్రికి అడవి పేరంటాలమ్మ కోలాట బృందం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారి గుడి ముందు కోలాట ప్రదర్శన నిర్వహించి భక్తులందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం కోలాటం మాస్టారు యలగాల శ్రీకాంత్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి రూ.16 వేలు విలువజేసే ఫ్రిజ్‌ని బహుకరించారు. అనంతరం భక్తులను పులిహోర, చక్ర పొంగలి, పరమాన్నం ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీఐ సాంబశివరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణ ఉత్తమ సీఐగా పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర చేతుల మీదుగా ప్రసంశలు అందుకున్న సీఐ సాంబశివరావును కళాకారుల బృందం బృందం దుశ్శాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేలపట్ల హరిబాబు, డైరెక్టర్ (ఆర్టిసి) వైస్ ప్రెసిడెంట్ బక్క వెంకటేష్, రచయిత సెక్రటరీ మాచర్ల ఏసోబు, ట్రెజరీ వంగల ఇజ్రాయిల్, గౌరవ సలహాదారులు డి ఐ కుమార్, కట్టెంపూడి నాగేశ్వరరావు, మాజీ సెక్రటరీ డి స్కైలాబ్ డాన్స్ మాస్టర్లు కోటయ్య, కారుమంచి కోటి, ఢిల్లీ తిరుపతిరావు, డైరెక్టర్ కామేపల్లి సుధీర్ , డైరెక్టర్ చిరంజీవి, యువ డైరెక్టర్ గుద్దేటి ఆదాం , రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్ర జయప్రదం చేయండి: మారుతి

విశాలాంధ్ర-పెదకూరపాడు : పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోకి ఈ నెల 27వ తేదిన ప్రవేశించనున్న సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాద్ సీపీఐ శ్రేణులకు తెలిపారు. శనివారం మండల పరిధిలోని 75 తాళ్లూరు సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో జరుగుతున్న ఈ బస్సు యాత్ర విశాఖ పట్నంలో ఈ నెల 17వ తేదీన ప్రారంభమై సెప్టెంబరు 8వ తేదీ తిరుపతిలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని ఈలోగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోను ఈ బస్సు యాత్ర విస్తృతంగా పర్యటిస్తుందని అన్నారు. పల్నాడు జిల్లాలో ఈ బస్సు యాత్ర 27న నరసరావుపేటలో మూడు గంటలకు ప్రారంభమై అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు వినుకొండలో గొప్ప బహిరంగ సభ జరుగుతుందని, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పార్టీ శ్రేణులు ప్రజలు కార్మికులు రైతులు ఈ బస్సు యాత్రలో బహిరంగ సభ ముగింపు వరకు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. మోదీ జగన్ ప్రభుత్వాలు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించాయన్నారు. మోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా వెనుకబడిన జిల్లాలకు నిధులు కూడా ఇవ్వలేదని జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా అనేక ఆటంకాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి వారికి అప్పనంగా అప్పజెప్పుతున్నారని విమర్శించారు. మన ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కును ప్రైవేటు కంపెనీలకు అమ్మ చూపుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం సిగ్గుచేటన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను విపరీతంగా పెంచి ప్రజ లపై ధరాభారాలను మోపారని ఫలితంగా సామాన్యుడు వాడుకునే నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన కొనసాగిస్తూ ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను, ఆర్టీసీ చార్జీలు, కరెంటు చార్జీలు విపరీతంగా పెంచారని విమర్శించారు. ప్రజలు వాడుకునే నిత్యవసర సరుకులు అడ్డుఅదుపు లేకుండా ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అడ్డగోలుగా మట్టి మాఫియాలు మైనింగ్ మాఫియాలు ఇసుక మాఫియాలు రియల్ ఎస్టేట్ మద్యం మాఫియాలు విచ్చలవిడిగా రాష్ట్రాన్ని దోచేస్తున్నాయని, ఈ రాష్ట్రాన్ని వారి కబంధహస్తాల నుంచి విముక్తి చేసేందుకు ప్రజలను చైతన్యపరుస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలో ఈ బస్సు యాత్ర జరుగుతోందని ప్రజలందరూ పాల్గొని చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, చల్లా పది పాపయ్య, బలుసుపాటి వీరయ్య పాల్గొన్నారు.

దసరా నాటికి గృహ ప్రవేశాలు: మంత్రి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : నియోజకవర్గంలో జగనన్న కాలనీల్లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ దసరా నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశాలు జారీ చేశారు. పేదలందరికీ ఇళ్లు.. పథకంలో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి పూర్తి స్థాయి సమీక్ష సమావేశాన్ని మంత్రి నిర్వహించారు. తొలుత పసుమర్రు లే అవుట్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మంత్రితో పాటు అధికార యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాన్ని వేగవతంగా చేయాలన్నారు. దసరా నాటికి కనీసం 1500 ఇళ్ల నిర్మాణం పూర్తికావాలన్నారు. అన్ని లే అవుట్లలో ప్రజల అవసరాలకు తగినట్లుగా మంచినీటి వసతి కల్పించాలని తెలిపారు. కరెంటు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా వసతులన్నీ సమకూర్చామని, ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు.

ఇళ్లు లేని పేదలు ఉండటానికి వీల్లేదు...

నియోజకవర్గంలో ఇళ్లు లేని పేదలు ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నవారికి పూర్తిస్థాయిలో సహకరించాలని చెప్పారు. వారికి బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పసుమర్రు లే అవుట్‌కు అప్రోచ్ రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. నియోజకవర్గంలో ఇంకా ఇళ్ల నిర్మాణాలను మొదలుపెట్టని లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అన్ని విధాలుగా అండగా ఉంటాం: లక్ష్మీషా

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీ షా మాట్లాడుతూ అన్ని విధాలుగా లబ్ధిదారులకు అండగా ఉంటామని చెప్పారు. బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చూస్తామన్నారు. చిలకలూరిపేట అర్బన్ పరిధిలో పసుమర్రులో అభివృద్ధి చేసిన లే అవుట్ రాష్ట్రంలోనే అతి పెద్ద వాటిల్లో ఒకటని, ఇక్కడి లే అవుట్లు మొత్తాన్ని మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ లే అవుట్లకు అప్రోచ్ రోడ్లను వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, నియోజకవర్గంలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి

విశాలాంధ్ర-కారంపూడి : మండలంలోని నరమాలపాడు గ్రామం వైకుంట్టపురం సమీపంలో సర్వే నెంబర్ 667/9లో మురుస గుంతల భూమి 5 ఎకరాలు ఉంది. అసైన్డ్ భూమిగా ఉన్న ఈ మురుస గుంతలలో గ్రామానికి చెందిన రైతులు తమ గేదెలను నీరు తాగేందుకు ఉపయోగించుకుంటున్నారు. ఆ భూమిపై కొందరు భూ బకాసురులు కన్నేశారు. ఆ భూమిపై కొందరు మట్టి తోలించి కబ్జా చేయడానికి రెవెన్యూ అధికారుల సహకారంతో భూమికి సంబంధించి కొలతల సర్టిఫికెట్ పొంది పాస్ పుస్తకం తీసుకొని బ్యాంకులో తనఖా పెట్టి భారీ స్థాయిలో రుణం పొందబోతున్నట్లు తెలుస్తుంది. సుమారు 30 సంవత్సరాలుగా ఎస్టీ సామాజిక వర్గం రైతులు సాగు చేసుకుంటున్న భూములకు కొలతలు వేయడానికి రాని అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ గ్రామానికి చెందిన వైసీపీ నేతలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామకృష్ణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తక్షణమే భూమి కొలతలను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు వైసీపీ నేతలు తెలిపారు.

ఏపీఎన్జీఓస్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మాచర్ల : ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగు ఏపీ నాన్-గెజిటెడ్ సంఘం 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాచర్ల ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీగిరిరాజు నరసింహాబాబు, మెట్టు రఘురామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొంటారని, మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎన్జీఓ సంబంధించిన ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శుక్రవారం 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు కలసి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బేగం మాట్లాడుతూ మురుగు కాలువలు నీరు నిలవడం వల్ల దోమలు నిలబడటంతో గుడ్లు ఏర్పడి డెంగ్యూ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రతిఒక్కరూ దోమతెరలు వాడాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ

విశాలాంధ్ర-రెంటచింతల : సకల శుభాలకు ఆవాసం.. లక్ష్మీప్రదమైన శ్రావణమాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపించేలా నెలరోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో దైవ నామస్మరణ మారుమోగుతోంది. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా పవిత్రత ఉంటుందన్నది వేద పండితుల ఉవాచ. సకల దేవతలకు ప్రీతికరమైన ఈ మాసంలో రోజు ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే దీర్ఘ సుమంగళీ యోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయన్నది భక్తుల విశ్వాసం. శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని మండల కేంద్రమైన రెంటచింతల, పరిసర గ్రామ ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెంటచింతలలోని చౌడేశ్వరి ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో మహిళలు అమ్మవారికి శ్రావణమాసం సారెను సమర్పించారు. వాసవీ కన్యకా ఆలయం నుంచి పురవీధులలో మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ అమ్మవారికి గోమాతతో సారె ఊరేగింపు నిర్వహించారు. చౌడేశ్వరి ఆలయంలో అర్చకులు ఓరుగంటి మారుతీ శర్మ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రిష్ఠి సత్యనారాయణశర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆయా ఆలయాల ధర్మకర్తలు నాళం బాబు, కట్టమూరి వెంకట నాగేశ్వరరావు భక్తుల దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీవీఐటీలో పవర్ గ్రిడ్ ఆపరేషన్స్‌పై సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'స్కాడా టూల్, పవర్ గ్రిడ్ ఆపరేషన్స్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.కిరణ్ హాజరై ఐఈఐ విద్యార్థి విభాగం నిర్వహించిన కార్యక్రమాల సమూహంతో ప్రచురించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.కిరణ్ విద్యార్థులకు పవర్ గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా పనితీరును వివరించారు. అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఏ విధమైన విధానాలు అవలంబించాలో విద్యార్థులకు తెలియజేశారు. పవర్ గ్రిడ్ ఎదుర్కొను సైబర్ ఎటాక్స్‌ను బిగ్ డేటా ఎనలిటిక్స్, డేటాసైన్స్ వినియోగం ద్వారా నిర్మూలించవచ్చని అన్నారు. స్కాడా సాఫ్ట్‌వేర్ టూల్ ద్వారా డేటాను సేకరించి, దానిని విశ్లేషించి పవర్ గ్రిడ్ స్థిరత్వాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లి ఖార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పేద రికం ప్రతిభకు, ఉన్నత వైద్య విద్య అభ్యసించేందుకు అడ్డుకాకూడదని మురికిపూడి సొసైటీ మాజీ అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం చిలకలూరిపేట పట్టణం లోని సీఆర్ కాలనీలో గల పఠాన్ యూసఫ్ ఖాన్ నివాస గృహం వద్ద ఆరాధ్యుల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ళ మండలం లంకెలకూరపాడు గ్రామానికి చెందిన షేక్ కాసింబి అనే విద్యార్థిని ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించడం జరిగింది. కళాశాల ఫీజులు, ఇతర ఖర్చుల నిమిత్తం పఠాన్ చిన్న సత్తార్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50 వేలను విద్యార్థినికి సోమేపల్లి వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా అందించడం జరిగింది. అంతేకాకుండా ఎంబీబీఎస్ వైద్య విద్య అనంతరం పేద ప్రజలకు సేవలను అందించాలని పటాన్ చిన్న సత్తార్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పఠాన్ యూసఫ్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ప్రమీల, గట్టా రమేష్, పఠాన్ నజీర్, షేక్ బాషా, ఊటుకూరి సుబ్రహ్మణ్యం, షేక్ రియాజ్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'భవిష్య ఫిజియోథెరపీ' క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక జేకేసీ కాలేజీ రోడ్డు విజయపురి 2వ లైను మెయిన్‌రోడ్డులో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన 'భవిష్య ఫిజియోథెరపీ' క్లినిక్ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.శివ శంకరయ్య శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో ఆధునిక హంగులతో కేటాయించిన వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఫిజియోథెరపీ సేవలు ఎంతైనా అవసరమన్నారు. నేడు ప్రతి ఒక్కరూ కీళ్ళ నొప్పులు, నరాలకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ నేపథ్యంలో వారికి ఫిజియోథెరపీ సేవలు అత్యావశ్యకమన్నారు. మోకాళ్ళ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి సమస్యలతో ఎందరో ఇబ్బందులకు గురవుతున్నారని, ఇటువంటి సమస్యలకు మా క్లినిక్ నందు అధునాతన పరికరాలతో అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. క్లినిక్‌కు రాలేని వారికోసం తమ ఇంటి వద్దకు వచ్చి ఫిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. లేడీ పేషంట్‌కు లేడీ థెరపిస్టులు ఉన్నారని, ఈ థెరపీ వల్ల ఎటువంటి సమస్యలు రావన్నారు. ప్రతి రోజు ఉదయం 9గంగల నుంచి సాయంత్రం 10గంటల వరకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. గుంటూరు పట్టణంలోని పలువురు డాక్టర్లు విచ్చేసి డాక్టర్ రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవసాయం దండగన్న బాబును రైతులెలా నమ్ముతారు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-వినుకొండ: తన పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు నేడు రైతులు పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు విమర్శించారు. శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాలన వస్తే రైతులకు న్యాయం జరుగుతుందని చంద్రబాబు ప్రసంగాలు చేయడం దయ్యాలు వేదాలు వల్లించటమేనని అన్నారు. 2014 ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ గద్దెనెక్కిన చంద్రబాబు 2019 వరకు రైతన్న పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేశాడని విమర్శించారు. తొలి రోజుల్లో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు. నేడు రైతులను ఎలా కలుస్తున్నాడని ఎమ్మెల్యే విమర్శించారు. వైసిపి ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నదని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర ఎరువులు, పురుగుమందులు, అన్ని రకాల అవసరాలు తీరుస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారని నేడు చంద్రబాబు ఆక్వా రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అలాగే చేనేత కార్మికులను తీవ్ర పేదరికంలోకి నెట్టి వేశారన్నారు. నేడు వైసిపి ప్రభుత్వం ఈ బీసీ నేస్తం, అలాగే ప్రతి రైతుకు 13500 నగదు, సొసైటీల ద్వారా వివిధ రుణాలు ఇస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పలు రకాల సంక్షేమం కింద రెండు లక్షల 16 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సైకో అంటున్న చంద్రబాబు ఆ పేరు చంద్రబాబుకు బాగా సరిపోతుందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం జిడిసిసి బ్యాంకు ద్వారా ప్రతి రైతుకు పదిహేను లక్షల వరకు ఋణం మంజూరు చేస్తున్నదని. అలాగే 18 లక్షల మంది రైతులకు 672 కోట్లు. ఇన్ ఫుట్ సబ్సిడీ ఇవ్వడం జరిగిందన్నారు. చంద్రబాబు అన్న క్యాంటీన్లు అంటూ అందరినీ బిచ్చగాళ్లుగా అవమానిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇక యువగళం పేరుతో నారా లోకేష్ అన్ని వర్గాల యువతను రెచ్చగొడుతున్నారని కేసులు పెట్టించుకోండి ప్రభుత్వం రాగానే మీకు పదవులు కల్పిస్తామంటూ చెప్పటం సిగ్గుచేటు అన్నారు. యువత పోలీస్ కేసులు పెట్టించుకుంటే వారి భవిష్యత్తు ఏంటని వారు విదేశాలకు ఎలా వెళ్తారని ఎమ్మెల్యే బొల్లా ప్రశ్నించారు. అలాగే వాలంటీర్ల వ్యవస్థను అవమానిస్తూ మాట్లాడుతున్న టిడిపి ఆనాడు టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో అక్షరం ముక్క రాని జన్మభూమి కమిటీలు ఎంత అవినీతికి పాల్పడింది ప్రజలు మర్చిపోలేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు.

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో విశాఖపట్నం లో ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన సీపీఐ ప్రచార జాత - బస్సు యాత్ర ఈ నెల 27వ తేదీన పల్నాడు జిల్లాకు చేరుకుంటుందని పార్టీ శ్రేణులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రామకృష్ణ సారధ్యంలో ప్రారంభమైన బస్సు యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు ఘన స్వాగతం పలికి నీరాజనాలు పడుతున్నారని అన్నారు. ఈ నెల 27వ తేదీన బస్సు యాత్ర గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని సాతులూరుకు చేరుకుంటుందని, అందరూ పాల్గొని ఘన స్వాగతం పలకాలని అన్నారు. బస్సు యాత్ర సందర్భంగా నరసరావుపేట పట్టణంలో భారీ కాన్వాయ్‌తో ప్రదర్శన జరుగుతుందని, అనంతరం వినుకొండ వరకు భారీ బస్సు యాత్ర కొనసాగుతుందని వినుకొండలో భారీ బహిరంగ సభ జరుగుతుందని రాంబాబు అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, షేక్ చిన్న జాను సైదా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రూ.2.27 కోట్లతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-నరసరావుపేట : పట్టణ పరిధిలోని 25వ వార్డు రెడ్డి నగర్, పోస్టల్ కాలనీ ప్రాంతాల్లో రూ.2.27 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పను లకు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు కె.రవీందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మంగపతి రెడ్డి, వెంకటేష్ రెడ్డి, చిన్నపరెడ్డి, సదాశివరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలందరూ అధికారులకు, ప్రభుత్వానికి సహకరించాలని అన్నారు.

సమస్యల పరిష్కారానికే ఎంప్లాయిస్ గ్రీవెన్స్

విశాలాంధ్ర-నరసరావుపేట : కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్‌లో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలపై వినతుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంపై ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌ను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. 20 మంది ఉద్యోగులు కలెక్టర్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. ఉద్యోగులు ఇచ్చిన అన్ని సమస్యలను సావిధానంగా విని సమస్యలను స్వీకరించారు. సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించండి: భవన యాజమనులు

విశాలాంధ్ర-పొన్నూరు : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించిన తమ ఇళ్లకు రక్షణ కల్పించాలంటూ భవన యజమానులు వేడుకుంటున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తమ ఇళ్ళ ముఖ భాగములను తొలగించడంతో ఇళ్లల్లోకి చొరబడి దొంగలు దొంగతనాలకు పాల్పడుతూ ఉండటంతో అర్బన్ పోలీసులకు వారు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గత వారం రోజులుగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్ల తొలగింపు కార్యక్రమం జరుగుతున్న విషయం విదితమే. ఇల్లు ఖాళీ ఒకటి ఏడుస్తుంటే చుట్టకు నిప్పు కావాలని మరొకడు అడిగాడంట అన్న చందాన... ఓ పక్క రోడ్డు విస్తరణ పనుల్లో సర్వం కోల్పోయి ఉన్న సామాన్లు సర్దుకునే పనుల్లో ఇళ్ళ యజమానులు ఉంటే ఇదే అదునుగా దొంగలు ఇంటి సామాన్లు దొంగలించే పనిలో పడ్డారు. గత నాలుగు రోజులుగా తమ ఇళ్లల్లో సామాన్లు పోతున్నాయంటూ భవన యజమానులు లబోదిబోమంటున్నారు. దీంతో జీబీసీ రోడ్‌లోని భవన యజమానులు అర్బన్ సీఐను కలిసి తమ గోడు వినిపించి ఫిర్యాదు చేశారు. వారితో చర్చించిన అర్బన్ సీఐ అల్తాఫ్ హుస్సేన్ వారికి రక్షణ కల్పించేందుకు హామీని ఇచ్చారు. పోలీసులతోపాటు భవన యజమానుల నుంచి ఓ వ్యక్తిని అటాచ్ చేయడం ద్వారా వారి ఇళ్లకు రక్షణ కల్పించే టీంను ఏర్పాటు చేయడం ద్వారా దొంగల బెడద నుంచి విముక్తి కలిగించేందుకు ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జీబీసీ రోడ్‌లోని భవన యజమానులు తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆధ్వర్యంలో డీపీసీ సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, జడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిష్టినా ఆధ్వర్యంలో 2023-24 ఖరీఫ్ కాలానికి సంబంధించి జిల్లా కొనుగోలు కమిటీ(డీపీసీ) సమావేశం డీఆర్సీ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ జి.రాజ కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ 2023-24 త్వరలో ప్రారంభమవుతున్న సందర్భంగా ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు, అనుసరించవలసిన విధివిధానాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చర్చించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను తనిఖీ చేసి, మిల్లు సామర్థ్యం, ఇతర వివరాలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎన్.శివరామకృష్ణ, జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పి.కోమలి పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ శాఖ అధికారి రాజబాబు, జిల్లా సహకార అధికారి వీరాచారి, జిల్లా రవాణా అధికారి ఎన్.గోపాల్, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

21న జగద్ధాత్రి ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్‌తో, భిన్నమైన సీరియల్స్‌తో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'జగద్ధాత్రి' అంటూ మరో కొత్త సీరియల్‌తో జీ తెలుగు మీ ముందుకు రాబోతోంది. దీప్తి మన్నె- దర్శి చంద్రప్ప ప్రధాన పాత్రలలో నటించిన 'జగద్ధాత్రి' ఈ నెల 21 నుంచి ప్రతిరోజూ రాత్రి 7:30 గంటలకు ప్రసారం కానుంది. ఈ సీరియల్ అసా ధారణమైన కథాం శంతో ఊహించని మలుపులతో ప్రేక్షకు లను తప్పకుండా ఆకట్టుకుంటుంది. జగధాత్రి(దీప్తి మన్నె) తన మిత్రుడు కేదార్(దర్శ్ చంద్రప్ప)తో కలిసి సీక్రెట్ ఏజెంట్స్‌గా పనిచేస్తారు. కుటుంబంలో పెద్ద కుమార్తెగా, బాధ్యతల మధ్య సమతుల్యతను కలిగి ఉన్న జగద్ధాత్రి ప్రయాణమే ఈ కథ. ఈ సీరియల్ గురించి నటి దీప్తి మన్నె మాట్లాడుతూ ఇదొక సీక్రెట్ ఏజెంట్ కథ మాత్రమే కాదు, ఒక మహిళ తన గతం, తన కుటుంబం. వృత్తిని సమన్వయం చేసుకుంటూ జీవిస్తూనే అక్రమా లకు వ్యతిరేకంగా పోరాటం సాగించే అద్భుతమైన కథ అన్నారు.

ఒరిజినల్ SSC సర్టిఫికెట్ మరియు వొకేషనల్ కోర్సు సర్టిఫికెట్స్ పోయినవి.

నా పేరు **దేరంగుల హరీష్ తండ్రి శ్రీనివాసరావు.** నాది జెట్టిపాలెం గ్రామం, రెంటచింతల మండలం, పల్నాడు జిల్లా. నేను జెట్టిపాలెం మోడల్ స్కూల్ నందు SSC తరగతి వరకు చదివియున్నాను. నేను రెంటచింతల మెయిన్ సెంటర్ నందు నా ఒరిజినల్ SSC సర్టిఫికెట్ (2114123499) మరియు వొకేషనల్ కోర్సు సర్టిఫికెట్ (211450 6083) జిరాక్స్ తీసుకుని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఎక్కడో పోయినవి. కావున ఎవరికైనా దొరికిన యెడల 9949821353 నంబర్‌కు తెలియపరచగలరు.

వారాబంధీ విధానంలో సాగునీరు సరఫరా చేయాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : వ్యవసాయానికి వారాబంధి విధానంలో సాగునీరు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంట పొలాలకు సాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా కాలువల మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నారు. సెప్టెంబర్10వ తేది లోగా ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని కార్డులు ఉన్నవారికి పంట రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగులో పురుగు మందులు బదులు కషాయం వినియోగించడానికి మండలానికి ఒక తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను అయన ఆదేశించారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైన మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకొనే విధంగా రైతులను ప్రోత్సాహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దశరథ మహా రాజు,వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశసంవర్ధక శాఖ జేడీ హను మంతరావు, మత్స్యశాఖ జేడీ సురేష్, ఏపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణ, ఉద్యాన వనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జెన్నెమ్మ, పౌర సరఫరాల శాఖ డిఎం శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని సూచించారు. జిల్లాలో అద్దంకి, మార్టూరు, ఏల్చురు రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. పోలీసు, ఆర్ అండ్ బి రవాణా అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అద్దంకి పట్టణంలో రోడ్డు వెడల్పుగా ఉన్నప్పటికీ తోపుడు బండ్లు వ్యాపారుల వల్ల రోడ్డు ఇరుకు వల్ల రోడ్డు ప్రమాదాలు జరుతు న్నాయని ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.చీరాల నుండి వేటపాలెం మధ్యలో ఎక్కువగా రోడ్లు ప్రమాదాలు జరుగు తున్నాయని రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసు కోవాలన్నారు. జిల్లా ఆదనపు ఎస్పీ మహేష్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ,ఆర్.అండ్.బి ఎస్.ఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల బాధ్యత అధికారులదే..

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని జిల్లాలో తొలిసారిగా ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో శుక్రవారం మొదలైంది. 11 మంది ఉద్యోగులు మా సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలను కలెక్టర్‌కి అందజేశారు. అర్జీదారుల సమస్యలు సావధానంగా విన్న ఆయన తక్షణమే వాటికి పరిష్కార మార్గం చూపారు. ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నింటిలోని ఉద్యోగులు తమ సమస్యలు విన్నవించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహిస్తామని ప్రకటించారు. కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టిసారిస్తా మన్నారు. ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించడానికే ఈకార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. సమోదైన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఏ.పి రెవిన్యూ అసోసియేషన్ కార్యాలయ భవనం కొరకు స్థలం కేటాయించాలని, కలెక్టరేట్ ఉద్యోగుల కొరకు క్యాంటీన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని ఏ.పి. రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి బి.ఓంకార్, టౌన్ యూనిట్ అధ్యక్షులు ఎస్.కె.మహబూబ్ బాషా కోరారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

సీఎం చిత్రపటానికి కాంట్రాక్ట్ అధ్యాపకులు పాలాభిషేకం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంట్రాక్ట్ అధ్యాపకులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి ఇబ్బందికరంగా ఉన్న 5 సంవత్సరాల నిబంధనలు తొలగించి 2014 జూన్ 2వ తేదీ నాటికి పనిచేసే అందరు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ వివిధ కార్యచరణలతో సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి మిగిలిపోయిన వారందరికీ రెగ్యులైజేషన్ పరిధిలోకి తీసుకు రావడానికి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. తమ కుటుంబాలు ముఖ్యమంత్రికి జీవి తాంతం రుణపడి ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు హసీనా ముబీన్, జీ.ధనలక్ష్మి, బి.సుతిచనా రాణి, జి.మాధవి,ఎం.లక్ష్మి, ఎస్.కృష్ణవేణి, బి.శివనాగరాజు,షేక్ మహబూబ్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీతాల కోసం ధర్నా

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వాడరేవు పంచాయితీలో పనిచేస్తున్న కార్మికులు తమకు 14 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ చీరాల మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు వసంత రావు మాట్లాడుతూ సంవత్సరం పైగా కార్మికులకు జీతాలు చెల్లించకపోతే జీవనాన్ని ఎలా సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

విజయవాడ 'గ్రామీణ యువగళం' ఇన్‌చార్జిగా వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సమస్యలు తెలుసుకొంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర శనివారం ఉమ్మడి కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఈనేపథ్యంలో బాపట్ల టీడీపీ ఇంచార్జీని విజయవాడ గ్రామీణ యువగళం ఇంచార్జీగా నియమిస్తూ పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్వర్వులు జారీ చేసింది. గన్నవరంలో జరిగే భారీ బహిరంగ సభకు వేగేశన ఇంచార్జిగా వ్యవహరించనున్నారు. నరేంద్ర వర్మ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో టీడీపీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. విజయవాడలో లోకేష్ యువగళం పాదయాత్ర అడ్డుకోవడానికి అధికార వైసీపీ పార్టీ నాయకులు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఫ్లెక్సీలు తొలగిస్తున్నారని అవి పిరికిపంద చర్యలు అని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రజా మద్దతుతో జిల్లాలో యువగళం పాదయాత్రను, గన్నవరంలో జరిగే బహిరంగ సభను భారీ ఎత్తున నిర్వహిస్తామని నరేంద్ర వర్మ తెలిపారు.

కాంస్య విగ్రహ నిర్మాణం వెనుక ఆంతర్యం ఏమిటి..?

విశాలాంధ్ర - చీరాల : పట్టణంలో ముక్కోణంపార్కు వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో దళిత, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. నూతనంగా చేపడుతున్న అంబేద్కర్ కాంస్య విగ్రహం నిర్మాణం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో చెప్పాలని వారు శుక్రవారం డిమాండ్ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ముక్కోణం పార్క్ వద్ద చేపడుతున్న అంబేద్కర్ కాంస్య విగ్రహ పనులను అధికారులు ప్రజా విరుద్ధంగా చేపడుతున్నారని ఆరోపించారు. ఆరాధ్య దైవంగా భావించే అంబేద్కర్ విగ్రహన్ని కనీసం ఏ ఒక్కరికి తెలియజేయకుండా అధికారులు ఇష్టానుసారంగా తొలగించి ప్రజల మనోభావాలను దెబ్బతీశారన్నారు. కనీసం అంబేద్కర్ అంటే అవగాహన లేని, రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను నిర్మాణ కమిటీలో చేర్చడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అసలు కాంస్య విగ్రహం రూపాన్ని, ప్లానింగ్, నమూనాలను దళిత, ప్రజాసంఘాలకు కోరినా ఇవ్వకుండా కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయంతో అధికారులు చేపట్టడం దుర్మార్గపు చర్యన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి ఏసురత్నం, బాబూరావు, శామ్యూల్ మోజెస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్‌డే

- ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పోలీస్ సిబ్బంది యొక్క శాఖాపరమైన సమస్యల పరిష్కరానికి పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించటానికి గ్రీవెన్స్-డే ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 92 మంది పోలీస్ సిబ్బంది వారి సమస్యలను ఎస్పీ విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకై పాటుపడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది యొక్క సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడానికి ప్రతి నెలలో ఒక రోజు గ్రీవెన్స్-డే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శాఖాపరమైన సమస్యలున్న పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరు పోలీస్ గ్రీవెన్స్-డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్బి సీఐ ఏ.శ్రీనివాస్, డిపిఓ ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్.కరిముల్లా కాలిషావలి డిపిఓ సిబ్బంది ఉన్నారు.

వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయడం ద్వారా ప్రజల అభిమానాన్ని, అధికారుల మన్ననలు పొందడమే కాకుండా జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చనని తహశీల్దార్ జివి,సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గీతామందిరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు అభినందన సభ జరిగింది. కార్యక్రమానికి విశిష్ట అతిధిగా హాజరైన పశువైద్యాధికారి మోహనరావు పురస్కార గ్రహీతల సేవలను, రోటరీ సేవలను కొనియాడారు. ప్రభుత్వ సంస్థలు, రోటరీ కలసి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చునని, నేడు సమాజం రోటరీ వైపు చూస్తున్నదని వీరవల్లి రుద్రయ్య అన్నారు. అనంతరం బాపట్ల జిల్లాలో ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలైన విద్యుత్ శాఖ ఈఈ మస్తానరావు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, అగ్రీ కల్చరల్ అధికారి వెంకటకృష్ణ,మున్సిపల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చెంచయ్యలను రోటరీ క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించారు.

పేరాల హైస్కూల్‌లో జీరో షాడో డే

విశాలాంధ్ర - చీరాల : జీరో షాడో టైమ్‌లో ఏ వస్తువుపైన కానీ, మనిషిపైన కానీ సూర్యుడి కాంతి పడినా నీడ కనిపించదని, దీన్ని సాంకేతికంగా జెనిత్ పొజిషన్ అంటారని పలువురు సైన్స్ ఉపాధ్యాయులు అన్నారు. పేరాల హైస్కూల్‌లో సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీరో షాడో డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీరో షాడో డే ఏటా రెండుసార్లు వస్తుందని, కర్కాటక, మకరరేఖల మధ్యనున్న ప్రాంతాల్లోనే ఇది కనిపిస్తుందని జీరో షాడో టైమ్‌లో సూర్యుడి కాంతి మనిషి పరిధిని దాటి పోలేదని అందుకే కింద నీడ పడదన్నారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగే క్రమంలో రొటేషన్ యాక్సిస్ 23.5 డిగ్రీల మేర వంగిపోతుందని, ఈ క్రమంలోనే మన వాతావరణంలో మార్పు వస్తూ ఉంటుందని అన్నారు. అంటే కాంతి తీవ్రతలో మార్పు వస్తుందని కానీసూర్యుడు కచ్చితంగా నడినెత్తి మీదకు కేవలం రెండేసార్లు వస్తాడని, ఉత్తరాయణంలో ఓసారి, దక్షిణాయనంలో మరోసారి ఇవి జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, చంద్రశేఖర్, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఓవర్‌టైమ్ అలవెన్సులు చెల్లించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ విస్తృతస్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశం బాపట్ల పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గరలోని యన్.జి.ఓ. హెూమ్ నందు జిల్లా అధ్యక్షులు పసుపులేటి చిరంజీవి అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన సమావేశంలో ఆర్టీసి ఇ.యు.రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పలిశెట్టి దామోదరరావు,కామ్రేడ్ జి.వి.నరసయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసి నుండి పిటిడి ఉద్యోగులుగా మారిన తరువాత ఉద్యోగులకు రావలసిన ఓవర్ టైమ్ అలవన్సులు నైట్ షిఫ్ట్ ఇతర అలవెన్సలను గతంలో జీతంతో ఇచ్చినట్లు చెల్లించాలన్నారు.ఏపియస్ ఆర్టీసి కార్మికులు విలీనం అనంతరం ఏపిపిటిడి ఆర్టీసీ ఉద్యోగులుగా మారిన తరువాత మెడికల్ ట్రీట్మెంట్ నందు ఇబ్బందులు తలెత్తినా యన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుచూ 11వ పిఆర్సీ అమలు జరిగిన అనంతరం కేడర్ ట్రింగ్ అప్లికేషన్‌లో జరిగిన ఇబ్బందులపై ఏపిపిటీడి ఎంప్లాయిస్ యూనియన్ కృషిమేరకు ఆర్టీసి మేనేజింగు డైరెక్టర్ ద్వారకాతిరుమలరావు గత నెల 24న అన్ని ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చలు సందర్భంగా ఉద్యోగులకు ఉత్పన్నమౌతున్న సమస్యలను రాతపూర్వకంగా ఇచ్చిన తరువాత ఉద్యోగులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదని ఆర్టీసి మేనేజింగు డైరెక్టర్ హామి ఇచ్చారని నరసయ్య తెలిపారు.రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు మాట్లాడుతూ విలీనం తరువాత రద్దు చేయబడిన పాత సదుపాయములను తిరిగి పునరుద్ధరణ చేయాలని, ప్రభుత్వంలో విలీనంకు ముందు ఉన్న ఆర్టీసి రిక్రూట్ మెంట్ రెగ్యులేషన్స్ ప్రకారమే పిటిడి ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ ఏపిజేఏసి అమరావతి నాయకత్వం కలసి కృషి చేస్తున్నామని ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొనిపోయి పరిష్కరానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి శంకరరావు మాట్లడుతూ పిటిడి ఉద్యోగులకు పెండింగులో వున్న లీవ్ ఎన్ క్యాష్‌మెంట్‌ను సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రభుత్వం చెల్లించేందుకు అంగీ కరించిందని తెలిపారు. జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు తీరుమార్చుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. రేపల్లే అద్దంకి డిపో అధికారులు,సూపర్ వైజర్ల వైఖరిలో మార్పురాకపోతే ఆ డిపోలో జరుగుతున్న పరిస్థితులన్నింటిని ఆర్టీసి యం.డి దృష్టికి తీసుకొని వెళ్తడమే కాకుండా అవసరమైతే జిల్లా వ్యాప్తంగా ఆరెండు డిపోలలో పనిచేస్తున్న అధికారుల వైఖరికి నిరసనగా బాపట్ల జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేపట్టడానికి సిద్ధపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.టి.పల్లి,జోనల్ అధ్యక్ష కార్యదర్శి వాకా రమేష్ డి.బాబు శ్యామ్యూల్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, జి.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.శంకరరావు జోనల్ కార్యదర్శి పాల్గొన్నారు.

కొత్తపేటలో మాజీమంత్రి పాలేటి ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని కొత్తపేట పంచాయతీలోని సంపత్ నగర్‌లో మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ మీరు శాసనసభ్యుడుగా పనిచేసిన సమయంలో సంపత్ నగర్ గ్రామంలో ఇళ్లకు ఓటిఎస్ పథకం ద్వారా ఇళ్ల పట్టాలు ఇప్పించడం జరిగిందని అన్నారు. సంపత్ నగర్ గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. బైపాస్ నిర్మాణం చేపట్టడం ద్వారా సంపత్ నగర్ గ్రామంలో ఇళ్లకు మంచి ధరలు వచ్చాయన్నారు. అనేకమంది వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయించారన్నారు రానున్న ఎన్నికలలో మేమందరం మీ వెంటే నడుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కటకం శ్రీనివాసరావు, షేక్ హుమాయున్ భాష, షేక్ అమిరుద్దీన్, షేక్ గౌస్ బాబు, షేక్ కరీముల్లా, జిలాని, మారు బోయిన శ్రీనివాసరావు, గోపీచంద్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

అర్చకులు పేర్లు నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర - వేమూరు : దేవాదాయశాఖలో ఇనాం భూములు కలిగి వంశపారంపర్య అర్చకులుగా పనిచేస్తున్న అర్చకులు ప్రతి ఒక్కరు వారి పేర్లను వెంటనే 43 రిజిస్టర్లో నమోదు చేయించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి,బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మేడూరు శ్రీనివాసమూర్తి తెలిపారు.శుక్రవారం వేమూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాని వంశపారంపర్య అర్చకులు తక్షణమే జిల్లా సహాయ కమిషనర్‌కు అర్జీ దాఖలు చేసుకోవాలన్నారు. ఆయా ఆలయాల పరిధిలోని అర్చక భాగస్తులందరూ కలసి దరఖాస్తును అందించాలన్నారు. రిజిస్టర్‌లో పేరు నమోదయి ఉంటేనే అర్చక వెల్ఫేర్ స్కీములోని ఉపయోగాలతోపాటు రైతు భరోసా వర్తిస్తుంది.రెవెన్యూ రికార్డులలో అనుభదార కాలం క్రింద సంబంధిత అర్చకుని పేరు కూడా నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఐదు లక్షల లోపు ఆలయాల నిర్వహణలాంటి ఫలితాలు కూడా వర్తిస్తాయని తెలిపారు.సహాయ కమిషనర్‌కు అర్జీ ఇచ్చిన వెంటనే 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదుతో పాటు వారి పేర్లను అడంగల్‌లో చేర్చడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలను దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.43 రిజిస్టర్‌కు సంబంధించిన అఫిడవిట్ అందించడంలో జాప్యం జరిగినప్పటికీ దరఖాస్తులు మాత్రం వెంటనే సహాయ కమిషనర్‌కు అందించాలని సూచించారు.దరఖాస్తులు అందించని పక్షంలో ఏ స్కీములు వర్తించవన్న విషయాన్ని అర్చకులు గుర్తిం చాలన్నారు. ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసినట్లయితే వారి పేర్లను సర్వీసింగ్ అనుభవదారు కాలములో నమోదు చేసే విధంగా కమిషనర్ కార్యాలయంలో తగిన చర్యలు ప్రారంభించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సత్ప్రవర్తనతో, ఉన్నత ప్రమాణాలతో విద్యనభ్యసించాలి

- డీఎస్పీ వెంకటేశులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : విద్యార్థుల సత్ప్రవర్తనతో ఉన్నత ప్రమాణాలతో జీవిస్తూ ఉన్నత ఆశయాలే లక్ష్యంగా విద్యనభ్యసించాలని బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడమంటే చట్టాన్ని చేతిలోకి తీసుకోవడమేనని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి యాంటీ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం శిక్షలు కఠినంగా విధించబడతాయని,జైలు శిక్ష,పెనాల్టీ కూడా విధించబడతాయన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థుల వివరాలు పోలీసు రికార్డులలో చేరితే ఉద్యోగాలకు విదేశీ విద్యకుఅనర్హులుగా ప్రకటించ ˘బడతారన్నారు. గోల్ ప్లాన్ స్టార్ట్ జిపిఎస్ అనే భావనను లక్ష్యంగా చేసుకుని చక్కని ప్రణాళికను రూపొందించుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే స్కాలర్‌షిప్ నిలిపివేయబడటమేకాక వారిని పరీక్షలకు అనర్హుడుగా ప్రకటించి కళాశాల నుంచి వారిని డిబార్ చేయడం జరుగుతుందన్నారు. బాపట్ల ఎస్సై రఫీ మాట్లాడుతూ ర్యాగింగ్‌తో పాటు సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నష్టాల పట్ల విద్యార్థులను అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలతో పాటు యువతను ప్రక్కదోవ పట్టి పీడిస్తున్న లోన్ యాప్‌కు దూరంగా ఉండాలని సూచించారు. స్టూడెంట్స్ యాక్టివిటీస్ ఆఫీసర్ ఇంచార్జి టి.వి.శ్రీధర్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిషేధించబడిన విద్యాలయంగా కళాశాలకు గుర్తింపు తీసుకు రావలసిందిగా విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : అర్హులైన ఓటర్లకు న్యాయం చేయాలని మండల టిడిపి నాయకులు తహసిల్దార్ వెంకటరెడ్డిని కోరారు. మండలంలో ఓట్ల తొలగింపుపై మండల టిడిపి నాయకులు శుక్రవారం సమావేశమైనారు. వారు మాట్లాడుతూ వైకాపా మద్దతుదారులు నిబంధనలకు విరుద్ధంగా ఫారం 7 పత్రాలను ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలికంగా పనుల నిమిత్తం వలస వెళ్లిన కూలీలు ఉద్యోగరీత్యా వెళ్లిన వారిని లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగింపునకు కుట్ర చేస్తున్నారని, ఒక వ్యక్తి రోజుకు గరిష్టంగా 10,ఫారం 7 దరఖాస్తులు మాత్రమే పెట్టాలని మొత్తం మీద 30కి మించిరాదని,ఎన్నికల నిబంధనలను వైకాపా మద్దతుదారులు విడనాడి ఒక్కొక్కరు 100కు పైగా ఫారాలను నమోదు చేశారని ఆరోపించారు. యద్దనపూడి మండలంలో 19 వేల ఓటర్లకుగాను మూడు వేల పైచిలుకు ఓట్ల తొలగింపుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు రావడం అన్యాయమన్నారు. వెంటనే దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని లేనిపక్షంలో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నల్లపనేని రంగయ్యచౌదరి,కనపర్తి నాగేశ్వ రరావు, రాయపాటి సీతయ్య, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ,కోయ సతీష్, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, రాయుడు, నిమ్మల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని 5కోట్ల ఆంధ్రుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ అనేక పథకాలను మ్యాని ఫెస్టోలో పొందుపరిచారని తెదేపా నాయకుల న్నారు. టీడీపీ ఇంఛార్జి ఎం.ఎం.కొండయ్య ఆదేశానుసారం శుక్రవారం చీరాల మండలంలోని వాడరేవు గ్రామ పంచాయితీలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరుగుతూ తెదేపా ప్రకటించిన పథకాలను గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళాభివృద్ధికి తెదేపా ప్రకటించిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం,కౌతరపు జనార్ధన్ రావు,గజవల్లి శ్రీనివాసరావు, కొమ్మన బోయిన రజని,సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నేడు బుద్దాంలో 6వ వార్డుకు ఉప ఎన్నిక

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని బుద్దాం గ్రామంలో 6వ వార్డుకు శనివారం ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికలో నర్రా వెంకటేశ్వర్లు, మిద్దిబోయిన శ్రీనివాస్‌లు బరిలో ఉన్నారు. వార్డులో 148 మంది ఓట్లు కలిగి ఉన్నారు. ఎన్నిక జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా ఎస్సై శివయ్య తన సిబ్బందితో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో జరుగున్న ఉప ఎన్నిక ఇదే కావటంతో అధికార వైసీపీ ప్రతిపక్ష టీడీపీలు చాలెంజ్‌గా తీసుకున్నాయి.

వార్డు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మునిసిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న పన్నెండు వార్డు వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న 37 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు శుక్రవారం పరిశీలించిన అనంతరం ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.రామ చంద్రారెడ్డి తెలిపారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి సెలెక్ట్ కాబడిన వారికి శనివారం నియామక పత్రాలు అందజేస్తామన్నారు.ఎంపిక కాబడిన వారు సోమవారం నుండి విధులకు హాజరు కావలసి ఉంటుందన్నారు.

నేడు అష్టావధానం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ సహజ సాహితి ఆధ్వర్యంలో చీరాల సంతబజారులో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో అష్టావధానం కార్యక్రమం జరుపనున్నట్లు సంస్థ అధ్యక్షులు వడలి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో చీమకుర్తికి చెందిన ఇలపావులూరి శేష శ్రీధర శర్మ అష్టావధానం చేస్తారని, సభా సంచా లకులుగా అప్పాజోస్యుల సత్య నారాయణ వ్యవహరిస్తారని తెలిపారు.

ఆటో బోల్తా ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామం పోలేరమ్మ గుడి వద్ద శుక్రవారం సాయంత్రం గ్రానైట్ రాళ్లతో అద్దంకివైపు నుంచి బల్లికురవ వైపు వస్తున్న ఏపీ39యువి 6863 అశోక్ లేలాండ్ ఎనక టైర్ పగలడంతో ఒక్కసారిగా పల్టీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ షేక్ రఫీకి గాయలవడంతో స్థానికులు గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.